హైదరాబాద్ వార్త





# గోవిందుడు అందరి వాడేలే...

హైదరాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: చిన్న కృష్ణుల అల్లరి.. గోపికమ్మల సందడి మధ్య శనివారం నగరం లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్ని వైభవంగా జరుపుకొన్నారు. విద్యాసంస్థల్లో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు, గేటెడ్ కమ్యూనిటీలు, కృష్ణ మందిరాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు అలరించాయి. ఇక అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్, బంజారాహిలోని జగన్నాథ మందిరంలో భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొని శ్రీ కృష్ణుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేపట్టారు.

**తెల్లాపూర్, ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్ఠమి వేడుకలు..**

శ్రీకృష్ణ జన్మాష్ఠమి మహోత్సవాలు తెల్లాపూర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు 5252వ అవతార దినోత్సవం సందర్భంగా 5252 నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం 2 గంటలకు పిల్లలకు శ్రీకృష్ణ వేశాధారణ పోటీలు, పాట, నృత్యం, కల రింగ్, ఫ్యాన్సీడ్రెస్, శ్లోక పఠనంతో కార్యక్ర మాలు, సా యంత్రం 5.30కు సాంస్కృ తిక ప్రదర్శనలు, రాత్రి 8 గంటలకు కథా-కీర్తనలు, రాత్రి 9 గంటలకు మహాభిషేకం,రాత్రి 10 గంటల కు ప్రత్యేక దర్శనాలు, రాత్రి 12 గంటలకు భక్తులందరికీ మహాప్రసాదం అందజేశారు.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సమన్వయంతో పని చేయాలి

**-మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు**



వెస్టు శ్రీనివాస కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ బూత్ ఇంచార్జ్‌ల సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు.

యూసుఫ్‌గూడ, ఆగస్టు 16, ప్రభాతవార్త : అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధిలోని వెస్టు శ్రీనివాస కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మధురానగర్‌లోని 105, 114 బూత్ ఇంచార్జ్‌ల ముఖ్యనేతల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే అకాల మరణంతో ఉప ఎన్నిక రావడం జరిగిందని అన్నారు. జూబ్లీహిల్స్‌లో గత పాలకుల నిర్లక్ష్యంతో 10 సంవత్సరాలుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని రాబోయే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామన్నారు. కంటోన్‌మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని అదేవిధంగా అధికారంలో ఉన్న పార్టీగా జూబ్లీహిల్స్‌లో కూడా గెలిస్తే అభివృద్ధి మరింత సాధ్యమౌతుందన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ప్రజలకు కొత్త రేషన్‌కార్డులు అందిస్తూ, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అదిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపే విధంగా అభివృద్ధి చేస్తున్నామని రోడ్లు డ్రైనేజీ, శానిటేషన్ వ్యవస్థ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కృష్ణా, గోదావరి జలాలు తప్ప అదనంగా ఒక్క చుక్కనీరు కూడా తేలేదని అన్నారు. నగరంలో ఎక్కడ చూసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని చర్చించుకుంటున్నారన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీ విజయం రాష్ట్ర అభివృద్ధికి సంకేతమన్నారు. హైదరాబాద్ అభివృద్ధి మరింత జరగాలన్నా ముఖ్యమంత్రి చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావాలన్నా ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరానికి ఎన్నో అవకాశాలు వచ్చాయన్నారు. మూసీ ప్రక్షాళణ జరుగుతుందని తెలిపారు. హైదాబాద్ పారిశ్రామిక, టెక్నాలజీ పరంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో తామంతా ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ప్రతి కార్యకర్తకు నాయకులకు సరైన గుర్తింపు పార్టీ తీసుకుంటుందని తెలిపారు. దేశంలో ప్రతి రాష్ట్రం తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటుందని అన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కరించే బాధ్యత తమపై ఉందన్నారు. నియోజకవర్గంలోని నేతలంతా కలిసి ఐక్యంగా పనిచేస్తూ బూత్ స్థాయి నుంచి సమన్వయంతో ముందుకు వెళ్లాలని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే అజారుద్దీన్, చైర్మన్లు గుత్తా అమిత్‌రెడ్డి, అనిల్, నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నాగార్జు నారెడ్డి, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# మహానగరంలో గుప్పుమంటున్న హుక్కా

**-ప్రైవేట్ గదుల్లో జోరుగా సాగుతున్న దందా**
**-చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు**
**-తాజాగా చైతన్యపురిలో హుక్కా సెంటర్‌పై దాడి**
**-9 మంది అరెస్టు**

హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త: నగరంలోహుక్కా కేంద్రాలపై నిషేదం కొనసాగుతున్నా నిర్వాహకులు మాత్రం వెనకడుగు వేయడటం లేదు. ప్రైవేట్ గదులను అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా యువకులకు హుక్కా అందిస్తున్నారు. ఖాళీ సమయం దొరికితే చాలు ధనవంతుల నుండి మధ్యతరగతికి చెందిన యువకులు హుక్కా కేంద్రాలకు పరిమితమౌతున్నారు. గుప్పుగుప్పున పొగ పీలుస్తూ స్నేహితులతో కాలక్షేపం చేస్తున్నారు. కాగా పుట్టగొడుగుల్లా విస్తరించిన హుక్కా పార్లర్‌లను కట్టడి చేసేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా పెద్దగా ఫలించడం లేదు. కొద్దిరోజుల క్రితం హుక్కాపై కేంద్రం కూడా సీరియస్ అయింది. ధూమపానం పూర్తిస్థాయి నిషేదం విధించింది. హుక్కాపార్లర్‌లను మూసేయాలని ఆదేశించింది. కేంద్రం ఆదేశంతో పోలీసులు దాడులు నిర్వహిసున్నా నిర్వాహకులు మాత్రం అర్థరాత్రి సమయంలో వ్యాపారం కొనసాగిస్తున్నారు.హుక్కా కేంద్రాల నిర్మూలనకు పోలీసులు,ప్రభుత్వాలు కలిసి ఇప్పటికే అనేక దాడులు నిర్వహించాయి. నిర్వాహకులు కోర్టు నుండి స్టేతెచ్చుకోవడంతో వాటి ఇన్‌ఫ్రాస్టక్చర్‌లపై దృష్టి సారించిన ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కూల్చివేశారు. అయినప్పటికీ వ్యాపారానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు.



హుక్కాకు ఎక్కువగా యువత బానిసలవుతున్నారు. దాన్ని పీల్చేందుకు ఎంతటికైనా తెగిస్తున్నారు. ఇటీవల కాలంలో హుక్కాసెంటర్లలలో దొరికిన యువతను ప్రశ్నించగా హుక్కా లేకపోతే ఉండలేమని సమాధానం ఇస్తున్నారు. బేగం బజార్,బంజారా హిల్స్,జూబ్లీహిల్స్‌కు చెందిన కొంత మంది యువకులు ఏసమయమైనా పర్వాలేదు హుక్కా ఇస్తే చాలు అని వ్యాపారులకు ఆకర్షణీయమైన ధరను ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. పదిమంది బృందం రెండు గంటలకు పదివేలు చెల్లించేందుకు సిద్ధమైందంటే వారు ఎంతలా బానిసయ్యారో స్పష్టమవుతోంది. పోలీసులు కేసులు పెడుతున్నప్పటికీ వ్యాపారులు లాభాలను వదల్లేక బినమీలతో కేంద్రాలను తెరిసిస్తున్నారు. హుక్కా పీలిస్తే గంటకు ఐదు వందల నుండి వెయ్యి రూపాయల వరకు హుక్కా వసూలు చేసు_న్నారు. కొంతమంది సిబ్బందికి ఎక్కువ జీతం ఆశచూసి కేసులు అయితే ఖర్చులు తామే భరిస్తామని భరోసా ఇస్తున్నట్లు సమాచారం. పోలీసుల తనిఖీలు పెరుగుతుండటంతో అర్థరాత్రి మూడు గంటల తరువాత కొన్ని సందర్భల్లో తెల్లవారుజామున కూడా హుక్కాను అందిస్తున్నారు. ఇటీవల కాలంలో నగరంలో పోలీసులు బెడద ఎక్కువ కావడంతో వీటిని శివార్లలో గదులు అద్దెకు తీసుకుని దందా కొనసాగిస్తున్నారు.

## పటిష్టమైన చట్టం లేకనే...

హుక్కాపై నిషేదం ఉంది అయితే కొంతమంది వ్యాపారులు ఈ నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు.డబ్బుకు కక్కుర్తి పడి ప్రైవేట్ గదులు తీసుకుని హుక్కాను సరఫరా చేస్తున్నారు. వీరిని కట్టడిచేసేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి కేసులు పెడుతున్నారు.ఇవన్నీ చిన్నపాటి కేసులే కావడంతో వ్యాపారుల్లో భయం లేకుండా పోయింది.కఠినమైన కేసులు పెడితేనే దారికొస్తారని సీనియర్ అధికారులు తెలుపుతున్నారు.

## హుక్కా సెంటర్ పై పోలీసుల దాడి ..9 మంది అరెస్టు



చైతన్యపురిలో పోలీసులకు పట్టుబడ్డ హుక్కాసెంటర్ నిర్వాహకులు, కస్టమర్లు

నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా బహిరంగంగా హుక్కా సెంటర్‌ను నడిపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుక్కా సెంటర్‌పై దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో హుక్కా సెంటర్ నడిపిస్తున్న సమాచారం మేరకు చైతన్య పోలీసులు శుక్రవారం రాత్రి హుక్కా సెంటర్‌పై దాడి నిర్వహించారు. ఈ దాడిలో కాచిగూడకు చెందిన హుక్కా సెంటర్ మేనేజర్ పసుల శశికుమార్‌తో పాటు మరో ఐదుగురు సిబ్బంది మరో ముగ్గరు కస్టమర్లు పోలీసులకు దొరికారు. అందులో ఇద్దరు మహిళలు ఉండడం గమనార్హం. 9 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు హుక్కా సెంటర్ నిర్వాహనకు ఉపయోగిస్తున్న 13 హుక్కా పాట్స్, 15 హుక్కా హెడ్స్, 7 ఫ్లవర్స్, 9 హుక్కా పైప్స్, 18 హుక్కా ఫిల్టర్స్, ఒక స్టవ్ తదితర నిర్వహణకు సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

**-విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు: ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**




విద్యార్థి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో వేముల రామకృష్ణ తదితరులు

సైఫాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: కళాశాలల్లో బిటెక్, ఎంటెక్, డిగ్రీ, పిజి తదితర కోర్సులు చదివే 14 లక్షల మంది బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కళాశాలలను బహిష్కరించి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓ కార్యాలయాలను ముట్టడించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఫీజుల బకాయిలను, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని, వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఫీజుల బకాయిలను చెల్లించాలని సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర డిసిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదని, అలాగే ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులలో చాల మంది అవినీతి పరులు ఉన్నారని, వారి వల్లనే విద్యార్థులకు బకాయిలు చెల్లింపులు జరగడం లేదని ఆరోపించారు. ఈ అవినీతి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులపైన, వారి ఇళ్ళపైన దాడి చేస్తామని ఆయన హెచ్చరించారు. తాను ఆమరణ నిరాహారదీక్ష చేసి సాధించిన ఈ ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం వల్ల లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, ప్రస్తుతం ఫీజుల బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిందని, ఈ కాలంలో 4 లక్షల కోట్లు అప్పుతెచ్చిందని, కాని విద్యార్థుల బకాయిలు 7 వేల కోట్లు చెల్లించకుండా వివిధ పథకాలను చేపట్టిందని, ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు 'ట్రస్ట్ బ్యాంక్' ఏర్పాటు చేసికొత్త నాటకానికి తెరలేపిందని ఆయన దుయ్యబట్టారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల బకాయిలను, స్కాలర్‌షిప్‌నలు చెల్లించాలని,విద్యాశాఖ మంత్రిని నియమించాలని,విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్ని నమస్యల ను పరిష్కారించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్,బిసి నేతలు నందగోపాల్, వంశీకృష్ణ, మోడీ రాందేవ్, కరుణశ్రీ పాల్గొన్నారు.

# ఎస్‌పినగర్‌లో అధ్వానంగా రహదారులు



ఎస్‌పి నగర్‌లో గుంతలు మయంగా మారిన రహదారులు

చార్మినార్,ఆగస్టు 16 ప్రభాతవార్త : కిషన్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఎస్‌పి నగర్‌లో రహదారులు చెడి పోవటంతో బస్తీ వాసులు నరక యాతన అనుభవిస్తున్నారు. ఎస్‌పి నగర్‌లో గుంతలు మయంగా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలు మార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఫలితం లేకపోయిందని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.నంది ముస్లాయిగూడకు ఎదురుగా ఉన్న ఎస్‌పినగర్‌లో వందలాది ఇండ్లు ఉన్నాయి.చెడి పోయిన రహదారులపై ప్రజలు ప్రయాణం చేస్తున్న సమయంలో నానా అవస్థలు పడుతున్నారు.ఎప్‌పి నగర్‌లో మంచి నీటి పైపు లైన్ కోసం రహదారులను రెండు సంవత్సరాలు క్రితం తవ్వారు.పైపు లైన్ పనులు పూర్తి అయిన తర్వాత బస్తీలో కొత్త రహదారులను ఏర్పాటు చేయలేదు.కనీసం రోడ్లకు మరమ్మతులు కూడ చేపట్టలేదనిఎస్‌పినగర్ వాసులు తమ విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు.రహదారులలో గుంతలు ఉన్నందున వాహనదారులు వాహనాలు నడుపుతున్న సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారు.రాత్రి వేళల్లో చీకటిలో గుంతలలో జారిపడి వాహనదారులు పడి పోతున్నారు.బోనాల జాతర ఉత్సవాలలో ఎస్‌పినగర్ ప్రజలుఅమ్మవారికి బోనాలు సమర్పించటానికి రహదారులపై వెళ్లె సమయంలో పలు ఇబ్బందులు పాలయ్యారు.ఎస్‌పినగర్‌లో కొత్త రహదారులు ఏర్పాటు చేయాలని జిహెచ్‌ఎంసి అధికారులకు పలు మార్లు మొర పెట్టుకున్నప్పటికి ఫలితం లేక పోయిందని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ తెలిపారు.రెండు సంవత్సరాలు నుంచి బస్తీ వాసులు ఇబ్బందుల పాలవుతున్నారని వెంటనే ఎస్‌పినగర్‌లో కొత్త రోడ్లు వేయాలని సాయి కిరణ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఐదేళ్ల బాలుడిపై లైంగిక దాడి .. దారుణ హత్య

ఉప్పల్ ఆగస్టు 16,ప్రభాతవార్త రామంతపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. బిస్కెట్ ఇప్పిస్తానని బయటకు తీసుకెళ్లి అభం శుభం తెలియని ఐదేళ్ల పసి బాలుడి పై 17 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి పాల్పడి అపై హత్య చేశాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం .. రామంతాపూర్ కెసిఆర్ నగర్ లో ఉన్న టింబర్ డిపోలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కుటుంబం పనిచేస్తోంది. బతుకు తెరువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చిన ఈశ్వర్ పాండే భార్య పుల్లేశ్వరి పాండే దంపతులకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు కూతుర్లు కాగా ఒకరు కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వీరు పక్కనే నివసిస్తూ టింబర్ డిపోలో పనిచేస్తున్నారు. ఇదే డిపోలో పనిచేస్తున్న బీహార్ కు చెందిన 17 ఏళ్ల యువకుడు ఈనెల 12వ తేదీన మధ్యాహ్నం పాండే కుమారుడు అయిన ఐదే ళ్లబాలుడికి బిస్కెట్ ఇస్తానని బయటకి తీసుకెళ్లాడు. నిర్మానుష ప్రాంతంలో బాలుడు పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర నొప్పితో బాలుడు ఏడ్చినా ఆ కర్కశుల హృదయం కరగలేదు. ఈ విషయాన్ని మమ్మీ, పప్పాకు చెప్తానని బాలుడు చెప్పడంతో ఆగ్రహించిన మానవ మృగం సుతిలి తాడుతో మెడకు బిగించి, గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు. మృతదేహాన్ని మూసి సమీపంలోని ముళ్ళ పొదల్లో పడేశాడు. ఏమీ తెలియనట్టు అమాయకంగా నటిస్తూ తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పటికే బాలుడు కనిపించకపోవడంతో కంగారు పడిన తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. తల్లిదండ్రుల వెంట ఆ మానవ మృగం కూడా వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో చివరికి ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలుడు అదృశ్యం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా కాలనీలో సిసి ఫుటేజీలను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం బాలుడుని బయటికి తీసుకెళుతున్నట్లు సిసి ఫుటేజీలలో కనిపించింది. వెంటనే మానవ మృగాన్ని అదుపులోకి తీసుకొని విచారించగా లైంగిక దాడి ఆపై హత్య చేసినట్లు తానే స్వయంగా ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉద్యోగం ఇష్టంలేక యువకుడి ఆత్మహత్య

ముషీరాబాద్, ఆగస్ట్ 16, ప్రభాతవార్త: ఉద్యోగం చేయటం ఇష్టంలేని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం కవాడిగూడ ఉన్నికోటకు చెందిన వి.ఆంజనేయులు అనే ఆటో డ్రైవర్ కుమారుడు వి.రాజేష్(19) వారం రోజుల క్రితం హిమాయత్‌నగర్‌లోని ఒక కాల్ సెంటర్‌లో ఉద్యోగానికి చేరాడు. ఉద్యోగం తనకు ఇష్టంలేక పోయినప్పటికీ కుటుంబసభ్యులు వత్తిడి చేయటంతో మానసికంగా డిప్రెషన్‌కు గురైన రాజేష్, తల్లి తండ్రులు బయటకు వెళ్లిన సమయంలో ఒక గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లి రాజేష్‌ను పిలిచినా తలుపు తీయకపోవటంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపు గడి పగులకొట్టి చూడగా అప్పటికే రాజేష్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలికి చేరుకున్న గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించారు. ఆత్మహత్యకు ముందు రాజేష్ పెట్టిన వీడియో ఆధారంగా ఇష్టం లేని ఉద్యోగం వల్లనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

# మురుగు పరుగు ఆగదా?



సికింద్రాబాద్ చీఫ్‌రేషనింగ్ కార్యాలయం ముందు మురుగు పరుగులు పెడుతున్న దృశ్యం.

బేగంపేట ఆగస్టు 16,ప్రభాతవార్త : నగరాన్ని సుందరంగా ఉంచాలని,ప్రతి ప్రాంతంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలంటూ ప్రజాప్రతినిధులు ,ఉన్నతస్థాయి అధికారులు సిబ్బందికి ఆదేశాలు ఇస్తూనే ఉన్నారు.పరిసరాల పరిశుభ్రతపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.అయినా కొందరు సిబ్బంది నిర్లక్ష్యం మాత్రం వీడటంలేదు.ప్రధాన రోడ్డువెంట మురుగునీరు ఆగకుండా పారుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు.దీంతో ఆ మార్గంలో వెళ్లేవారు ముక్కు మూసుకోకుండా నడవలేమన్నట్లుగా ఉందని ప్రజలు వాపోతున్నారు.నిత్యం పదుల సంఖ్యలో ఆ కార్యాలయానికి ప్రజలు వివిధ సమస్యలతో వస్తుంటారు.అలాంటి ప్రభుత్వ కార్యాలయం ముందు నిత్యం మురుగు నీరు పారుతూ పాదచారులను ,ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది.ఈ సమస్య నెలల తరబడి ఉన్నా సంబంధిత అధికారులకు గానీ ప్రజాప్రతినిధులకు మాత్రం కన్పించకపోవడం విడ్డూరంగా ఉంది.సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి బేగంపేట మార్గ మధ్యంలో అగ్నిమాపక కేంద్రం దాటిన తర్వాత చీఫ్ రేషనింగ్ కార్యాలయం ఉంది.దీని ముందు నిత్యం మురుగు నీరు పారుతుండటంతో పాటు అక్కడే నిల్చిఉండి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది.కార్యాలయం ప్రధాన గేటు ముందు కూడా పెద్ద ఎత్తున మురుగు నీరు నిల్చి ఉంటుంది.అలాగే మరో గేటు ముందు ఉన్న మ్యాన్ హోల్ నుంచి నిత్యం డ్రైయినేజి నీరు పొంగి పొర్లుతూ సమీపంలోని అగ్నిమాపక కేంద్రం వరకు ప్రధాన రోడ్డు వెంట పారుతుంది.అయినా సంబంధిత అధికారులకు మాత్రం ఇది కన్పించకపోవడం విమర్శలకు తావిస్తుంది.దీనికి మరో పక్క శ్రీ వీరహనుమాన్ ఆలయం ఉంది.నిత్యం పొంగుతున్న డ్రైనేజీ నీటితో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు చీఫ్ రేషనింగ్ కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి



కృష్ణ స్వామి జయంతి వేడుకలు పాల్గొన్న నేతలు

**మెహిదీపట్నం, ఆగస్టు 16, (ప్రభాతవార్త):** కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను శనివారం గుడిమల్కాపూర్ డివిజన్ లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కార్వాన్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు బండారి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ముదిరాజ్ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు రాములు, బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షు లు దేవర శ్రీనివాస్, బండారి వెంకటేష్ టిని ఐక్యవేదిక ,ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు..

**కూకట్‌పల్లి నియోజకవర్గంలో...**



కొర్వి కృష్ణస్వామి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాసాని వీరేష్ ముదిరాజ్

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 16, (ప్రభాతవార్త) :** కూకట్‌పల్లి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘ వ్యవస్థాపకులు, మాజీ మేయర్ దివంగత నేత కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం బాలానగర్ శోభన బస్‌స్టాప్ వద్ద అఖిల భారత ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ పాల్గొని కొర్వి కృష్ణ స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి కార్పొరేటర్ ఆగం పాండు, కూకట్‌పల్లి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఇంఛార్జి అంబటి శ్రీనివాస్ ముదిరాజ్, పారిశ్రామికవేత్త మల్లి ప్రభాకర్, బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్, బాలానగర్ ముదిరాజ్ సంఘం సభ్యులు బాలిగా రాము ముదిరాజ్, మహిళ అధ్యక్షురాలు కాలకుంట్ల స్వాతి, తులసి, పాలమూరు రాజు, ఈట్టెల సత్యనారాయణ, ఇంద్ర నగర్ బాలస్వామి, మల్లేష్, బంగారయ్య, పిట్ల రాజు, ముత్యాల మురళి, రవి, అశోక్, తిరుపతి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం



వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమంలో బీజేపీ నాయకులు

**ముషీరాబాద్, ఆగస్ట్ 16, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని హైదరాబాద్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు కొనియాడారు. శనివారం వాజ్‌పేయి 7వ వర్ధంతి సభ బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పి.నాగరాజు ఆధ్వర్యంలో రెడ్డి బిల్డింగ్ ఎక్స్ రోడ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, జి.మల్లేష్, ఈ.ఎస్.ధనుంజయ, పి.గోవర్ధన్‌రెడ్డి, అచ్చి రమేష్, చుక్క జగన్, కే.చంద్రశేఖర్, డి.వెంకటేష్, కే.సురేష్, ఇ.బాలకృష్ణ, ఇ.యోగేష్‌గౌడ్, పర్మేష్‌యాదవ్, ఆర్.రామ్‌రెడ్డి, వి.రవీంద్ర, జి.శ్రీనివాస్, బి.శివ, షరీష్‌భాయ్, ఎల్.శ్రీనివాస్, రాఘవేందర్, రాజశేఖర్, దుర్గా, కే.సాయికుమార్, అనిల్, సాయి చరణ్, ఈ.అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పండుగల ప్రాధాన్యత భవిష్యత్ తరాలకు తెలియచేయాలి

**ఇంగ్లీష్ యూనియన్ పాఠశాల కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**



ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ లో కృష్ణాష్టమి వేడుకలు

**ముషీరాబాద్, ఆగస్ట్ 16, ప్రభాతవార్త:** మన పండుగల ప్రాధాన్యతను భవిష్యత్ తరాలకు తెలియచేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని ఇంగ్లీష్ యూనియన్ పాఠశాల కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ విద్యార్థులతో కలసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు కృష్ణ, గోపికల వేషధారణతో ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనం అదుపు తప్పి కిందపడిన గణేష్ విగ్రహం



**అత్తాపూర్ ఆగస్టు16, ప్రభాతవార్త :**
నవరాత్రి ఉత్సవాలకు గణనాథుని విగ్రహం తరలిస్తుండగా అపశృతి చోటు చేస్తుంది. పాతబస్తీకి చెందిన ఓ గణేష్ మండప నిర్వాహకులు లక్ష్మీగూడ నుంచి భారీ గణనాథ విగ్రహాన్ని ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. మైలార్దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం లక్ష్మీ గుడలో కొనుగోలు చేసిన భారీ గణనాథ విగ్రహాన్ని ఓ ట్రాలీ వాహనంలో లాల్ దర్వాజకు చెందిన ఉత్సవ నిర్వాహకులు తరలిస్తున్నారు. పల్లె చెరువు సమీపంలో వాహనంపై ఉన్న విగ్రహం ఒకసారిగా పక్కకు ఒరిగి కింద పడిపోయింది. దాంతో అటుగా వాహనాలు రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించారు.



బాలనగర్ డివిజన్ ఇంద్రానగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న బండి రమేష్



ఇంద్రానగర్‌లో నంద గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరైన సత్యం శ్రీరంగం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సోమేశ్ యాదవ్



శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోపిక వేషధారణలో చిన్నారి మహిర



బాల్‌వీర్ భక్తసమాజ్ ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి లింగ్విస్టిక్ మైనార్టీ యూత్ చైర్మన్ మురళీమోహన్‌సింగ్



హైదర్షాకోట్‌లోని ఎస్ఎంపి ఇంటర్‌నేషనల్ పాఠశాలలో శ్రీకృష్ణామి వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం



జీడిమెట్ల డివిజన్ పరిధి స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ ప్రకృతి రెసిడెన్సిలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో శ్రీకృష్ణుని వేషధారణలో దేవకి నంద



శ్రీ కృష్ణునిగా చిన్నారి ఆరాధ్య



కృష్ణామి వేడుకల్లో కృష్ణుడిని జోలపాడుతున్న మహిళలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## మట్టి వినాయకులను ప్రోత్సహించి ..పర్యావరణాన్ని కాపాడాలి : ఎమ్మెల్సీ దయానంద్

**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ ఇళ్లలో,కాలనీల్లో మట్టివినాయుడిని పెట్టుకుని పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంఎల్‌సి బొగ్గరపు దయానంద్ గుప్తా అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జైగణేష్ భక్తి సమితి చైర్మన్ కెఎస్ ఆనందరావు, అధ్యక్షులు ఏజైన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దయానంద్ మాట్లాడుతూ జైగణేష్ భక్తి సమితి 2016లో స్థాపించబడి తెలంగాణ,ఏపీ,కర్ణాటక , తమిళనాడు రాష్ట్రాల్లో భక్తిశ్రద్దలతో కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు.ఈసంస్థ ప్రధాన ఉద్దేశ్యం మట్టివినాయకులను ప్రోత్సహించడం, భారతీయ సంస్కృతిక సంప్రదాయ రక్షణ పండుగలను సాంప్రదాయబద్దంగా జరుపుకోవడం అన్నారు. అలాగే ఈసంస్థ ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాలు పంపిణీ, మట్టివినాయకులను తయారుచేసే కళాకారులను ప్రోత్సహించడం, భక్తిశ్రద్దలతో జైగణేశా అనిరాసిన పేపర్లను కాణిపాకం దేవస్థానానికి తీసుకెళ్లడం, మట్టివినాయకులను ప్రోత్సహించిన మండపాలను గుర్తించి వారికి అవార్డులు, సర్టిఫికేట్లు, మెమోంటోలు అందజేస్తామన్నారు. అలాగే నవరాత్రులు సందర్భంగా,శోభయాత్ర జరిగే సమయంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్టేజ్ ఏర్పాటు చేసి, అన్నదానం, పండ్లు,స్వీట్లు, వాటర్‌వంటివి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దయానంద్‌గుప్తా, ఆనందరావు, జైన్‌కుమార్ తదితరులు

## మాస్టర్ నైతిక్ రచించిన ఆంగ్ల పుస్తకావిష్కరణ

**హైదరాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**
✓ పాఠశాల విద్య, క్రీడలు, ఈతలు, నాట్యంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో శిక్షణ పొందుతున్న తాను రాణించగానికి అడుగడుగునా నా వెన్నంటి ఉంటూ నన్ను ప్రోత్సహిస్తున్న మా అమ్మ డాక్టర్ సాహెబ్ జాదా సృజన నాకు ప్రేరణ అని ఎనిమిదేళ్ళ బాలుడు మాస్టర్ నైతిక్ అన్నారు. మా అమ్మమ్మ డాక్టర్ కందిమళ్ళ భారతి, తాతయ్య ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ నాకు స్ఫూర్తి అంటూ ముద్దు ముద్దు మాటలతో వివరించాడు. శనివారం బాగ్‌అంబర్‌పేటలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ సీనియర్ సిటిజన్స్ పార్క్‌లో,కాలనీ ఉపాధ్యక్షులు సుధాకరరావు అధ్యక్షతన జరిగిన సభలో మాస్టర్ నైతిక్ రచించిన స్వీయ కథ గమ్యం, నేను, అమ్మ, నా పెద్ద స్వప్నం" ఆంగ్ల పుస్తకాన్ని స్వాతంత్ర్య సమరయోధుడు, బహుగ్రంథకర్త, నైతిక్ ముత్తాత కందిమళ్ళ ప్రతాపరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ..పుస్తకాలు చదివే, రాసే అలవాటు తగ్గిపోతున్న ఎలక్ట్రానిక్ యుగంలో నా మునిమనుమడు మాస్టర్ నైతిక్ తన క్రీడాభిమానాన్ని, పుస్తక పఠన ప్రీతితో కూడిన తన స్వీయానుభవాన్ని, దీర్ఘకాలిక స్వప్నాన్ని చక్కని కథా కథన శైలిలో రాయడం సంతోషంగా ఉందన్నారు. ఒక వైపు చదువులో ప్రతిభను ప్రదర్శిస్తూనే, మరోవైపు వివిధ రంగాలలో నైతిక్ రాణించాల్తి అంటూ ఆశీర్వదించారు. సభా ప్రారంభంలో ప్రొఫెసర్ ఎస్‌వి సత్యనారాయణ సభికులకు స్వాగతం పలుకుతూ తన స్వీయ కవిత˘మనుమడొస్తున్నాడ్తు చదివినప్పుడు శ్రోతలు ఉద్రూతలూగారు. మాస్టర్ నైతిక్ మాతృమూర్తి డాక్టర్ సృజన పుస్తక నేపథ్యాన్ని వివరిస్తూ.˘ఈ పుస్తకం తన తండ్రి ఎస్‌వి సత్యనారాయణ 72వ జన్మదినోత్సవ సందర్భంగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సిహెచ్ వేణుగోపాలరెడ్డి, బి.శేఖరరెడ్డి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, కార్యనిర్వహక కార్యదర్శి కెవిల్, కందిమళ్ల సావిత్రి, విజయలక్ష్మి, ఉషా, కళ్యాణి,పార్వతి,పుష్ప,చిలువేరు యాదగిరి, గందూరి నాగేశ్వరరావు, సింగరాజు నాగేశ్వరరావు, మక్కం మధుసూదన్, నూకల సుబ్బారావు, శర్మ, సుధాకర్, హరిప్రసాద్, వెంపటి గోపాలకృష్ణ మూర్తి, కృష్ణ మోహన్, ఆర్.పార్థసారధి, ఎం.బి.గంగారెడ్డి, డాక్టర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాస్టర్ నైతిక్ రచించిన ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ళ ప్రతాపరెడ్డి,చిత్రంలో ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ తదితరులు

## ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:**
విప్లవ వీరుడు, బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం గతంలో ట్యాంక్ బండ్ పై విగ్రహ ఏర్పాటుకు చూసిన స్థలాన్ని గౌడ సంఘా ల ప్రతినిధులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గతంలో ట్యాంక్ బం డ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటుకు స్థలాన్ని సేకరించి, రూ. 3 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత వృత్తి తీవ్ర సంక్షోభంలో ఉందని హైదరాబాద్ తో సహా రాష్ట్ర వ్యా ప్తంగా వందలాది కల్లుగీత సొసైటీలు మూతపడ్డాయని అన్నారు, తక్షణమే బేషరతుగా కల్లుదుకాణాలను తెరిపించా లి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. 10 లక్షలు ఎక్స్ రేషియోను ప్రకటించి, ఇప్పటికే పెండింగులో ఉన్న రూ.13.50 కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 25 వైన్స్, బార్లు కల్లుగీత సొసైటీలకు కేటాయించాలి. కోకాపేట లో గౌడ ఆత్మగౌరవ భవనం" ను ప్రారంభించాలన్నారు. అలాగే జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును ఆగస్ట్ 18వ తేదీన ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్టే విజయకుమార్ గౌడ్, అం బాల నారాయణ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్, వీరస్వామి గౌడ్, సోమన్న గౌడ్, కొయడ హర్షవర్ధన్ గౌడ్, బడేసాబ్, ఐలన్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, బాలరాజుగౌడ్, ఐలివెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

## ఆర్టీసీ ఉద్యోగులకు లీవు ఎన్‌కాష్‌మెంట్ చెల్లింపు నిధులు మంజూరు

**-ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి**

**చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త:**
ఆర్టీసీ ఉద్యోగులకు లీవు ఏంకాష్మెంట్ చెల్లింపు కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం శుభపరిణామం అని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.థామస్ రెడ్డి అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలం గా రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ఆర్టీసీ తెలంగాణా మజ్దూర్ యూనియన్ కూడా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్మెంట్ మొత్తాల చెల్లింపు గురించి ఆర్టీసీ యాజమాన్యానికి , ప్రభు త్వ పెద్దలకు పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వడం మూలంగా అందరి కృషి ఫలితంగా జూన్ 2022 నుండి మార్చి 2023 వరకు రిటైర్అయిన ఆర్టీసీ ఉద్యోగులకు లీవు ఎన్కాశ్మెంట్ చెల్లింపు కొరకు అవసరమైన నిధులు సమకూర్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మిగిలిన వారికి కూడా సాధ్యమైనంత తొందరలో చెల్లింపు జరగడానికి కృషిచెయ్యాలని, దానితో పాటు 2017 వేతన సవరణ బకాయిలు కూడా చెల్లింపు జరిపి రిటైర్డ్ కార్మికుల అవసరాలు తీర్చడమే కాకుండా హయ్యర్ పెన్షన్ లో పెరుగుదలకు యాజమాన్యం ,ప్రభుత్వం సహకరించాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఏఆర్ .రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్ , ప్రతినిధులు బి .యాదయ్య , జి .పి.ఆర్ రెడ్డి, బి. నరేందర్ , బి.పుల్లయ్య,ఎంహెచ్. అలీ పాల్గొన్నారు.

## అబిడ్స్ఇస్కాన్‌లో వైభవంగా కృష్ణుడి జన్మాష్టమి



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకు కృష్ణుడి విగ్రహం అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

**గన్‌ఫౌండ్రి,ఆగస్టు 16 ప్రభాతవార్త:**
శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను అబిడ్స్ ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు పాల్గొన్ని భగవాన్ కృష్ణుడికి ప్రత్యేక పూజ చేశారు.ఈసందర్భంగా బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ రామచందర్‌రావుకు ప్రత్యేక కృష్ణుడి విగ్రహాన్ని అందచేశారు.ఈకార్యక్రమంలో గొల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేందర్,బిజెపి నాయకులు అమర్ సింగ్,శైలేందర్‌యాదవ్,రఘు,అనిల్,రాజు,జితేందర్,హరినాథ్,వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో శ్రీకృష్ణునిపై ప్రత్యేక ప్రదర్శన





సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలోని భగవాన్ శ్రీకృష్ణుని కళాఖండం

**చార్మినార్,ఆగస్టు 16 ప్రభాతవార్త :**
సాలార్‌జంగ్ మ్యూజియంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా భగవాన్ శ్రీ కృష్ణునిపై ప్రత్యేక చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు.సాలార్‌జంగ్ మ్యూజియంలోని మొదటి అంతస్థులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను మ్యూజియంలో క్యూరేటర్ డాక్టర్.ఘన్‌శ్యామ్ కుసుమ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో భగవాన్ శ్రీ కృష్ణుని జీవితానికి సంబంధించిన యాభై కళాఖండాలు, అరుదైన చిత్రాలు ఉన్నాయని తెలిపారు.కార్యక్రమంలో మ్యూజియం ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వాచ్‌మ్యాన్ మృతి

**కొంపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త**
వాచ్‌మెన్‌కు విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా, పెంటపాడు మండలం పడమర విప్పారు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ (35) తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి బ్రతుకుతెరువు కొరకు ప్రగతి నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవారు. మంగళవారం సుమారు 11:45 గంటలకు అతను నివసించే నిలిమ రెసిడెన్సిలో వర్షపు నీటిని బయటికి పంపడానికి విద్యుత్ మోటార్‌ను ఆన్ చేశాడు. దీంతో అతనికి విద్యుత్ ఘాతం జరిగి గట్టిగా కేకలు వేస్తూ అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అతని భార్య పిల్లలు హుటాహుటిన విద్యుత్ షాక్‌కు గురైన దుర్గాప్రసాద్‌ను ప్రగతి నగర్‌లోని పీపుల్స్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో దుర్గ ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే చనిపోయారని ప్రకటించారు. దీంతో బాచుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే తన భర్త విద్యుత్ షాక్ తగిలి చనిపోయాడని అతని మరణంపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని దుర్గాప్రసాద్ భార్య పోలీసులకు తెలిపారు. విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిన దుర్గాప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు యువకుల వీరంగం

**బేగంపేట ఆగస్టు 16,ప్రభాతవార్త :** యువకులు ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలేరుకు చెందిన ఎంఎం రెడ్డి(35) ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.15వతేదీన తెల్లవారుఝామున 3,4గంటల మధ్య కంటోన్మెంట్ జేబీఎస్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ సిగ్నల్ పడటంతో బస్సును ఆపాడు.అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి ప్యాసెంజర్ డోర్‌ను కొట్టారు. వెంటనే డ్రైవర్ ఎం.ఎం.రెడ్డి ఓపెన్ చేసాడు.ఈ సమయంలో వారు బస్సును ఎందుకు ఆపావంటూ దూషించడమే కాకుండా దాడికి దిగారు.రెడ్ సిగ్నల్ పడిందని అందుకే బస్సును ఆపావంటూ ఎంత చెప్పినా వారు వినిపించుకోలేదు.అతన్ని కొట్టడమే కాకుండా బస్సుఅద్దాలను ద్వంసం చేసారు.తనపై దాడి చేసిన యువకులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కలినరీ ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యం

**- సీకా ఉపాధ్యక్షులు సుధాకర్ ఎన్ రావు**



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సుధాకర్ ఎన్‌రావు,యాదగిరి, సీతారాం ప్రసాద్, సంజయ్, విశ్వనాథ్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:**
కలినరీ ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యంగా సౌత్ ఇండియా కలినరీ అసోసియేషన్ ప్రధాన ఉద్దేశ్యమని సీకా ఉపాధ్యక్షులు సుధాకర్ ఎన్ రావు అన్నారు. హైదరాబాద్‌కు కలినరీలో ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని అందుకు తగ్గట్టుగానే నేటి యువతరాన్ని తయారు చేయాలన్నదే తమ ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు చెన్నైలో అంతర్జాతీయ కలినరీ పోటీలు నిర్వహిస్తున్నారని మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ కలినరీ పోటీలలో ప్రపంచవ్యాప్తంగా 3 వేల మంది పాకశాస్త్ర నిపుణులు పోటీపడుతున్నట్టు వివరించారు. ఈసందర్భంగా హైదరాబాద్ సోమాజిగూడ లోని ద పార్క్ హోటల్ లో పెద్ద ఎత్తున వర్క్‌షాప్ ను నిర్వహించారు. ఇందులో నగరంలోని ఆయా కళాశాలలకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు, వివిధ హోటల్స్ లో కళాశాలలో పనిచేస్తున్న చెఫ్‌లు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్ కు ప్రపంచ స్థాయిలో జరిగిన కలినరీ పోటీలో గోల్డ్ మెడల్స్ అందించిన ముగ్గురు ప్రధాన చీఫ్‌చే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ పోటీ ఏవిధంగా ఉంటుంది అందులో ఏఏ అంశాలు ఉపయోగపడతాయి అనేదానిపై వివిధ రకాలైన వంటకాలు, కేక్స్, ఇలా దాదాపు 24 రకాలైన వంటకాలను తయారుచేసి విద్యార్థులకు పాకశాస్త్ర నిపుణులకు నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సికాప్రతినిధులు చెఫ్ మాస్టర్స్ యాదగిరి, సీతారాం ప్రసాద్,సంజయ్ ,కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 18న రాజ్‌భవన్‌లో వికలాంగులకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భీమ్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, కీర్తనయాదవ్, నల్లగొండ శ్రీనివాస్ తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న రాజ్‌భవన్‌లో 'ఉచిత మెగా సర్జికల్ కరెక్షన్ అండ్ హెల్త్ క్యాంప్' నిర్వహిస్తున్నామని సొసైటి హైదరాబాద్ బ్రాంచి చైర్మన్ భీమ్‌రెడ్డి, డిసేబుల్ ట్రస్ట్ సిఈఓ డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ కీర్తనయాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఈ క్యాంప్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ క్యాంప్‌ను రాష్ట్ర గవర్నర్ జి.విష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారని, అలాగే క్యాంప్‌లో రాష్ట్ర మంత్రి అండ్లూరి లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొంటారని చెప్పారు. వికలాంగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, జనరల్ హెల్త్ చెకప్‌లు, డయాగ్నోస్టిక్ పరీక్షలు, పోషకాహారం, కంటి పరీక్షలు, ఉచిత కళ్ళజోళ్ళు పంపిణి, క్యాలిపర్స్, వీల్‌చైర్స్, ఎలక్ట్రిక్ మోటార్ వాహనాల పంపిణి జరుగుతుందని వివరించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు జరిగే ఈ శిబిరాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వికలాంగుల సంఘం చైర్మన్ నల్లగొండ శ్రీనివాస్, కిరణ్, యశోద, నాగభూషణం, వేణు తదితరులు పాల్గొన్నారు.

## 20 కిలోల డంబెల్స్‌ను అవలీలగా ఎత్తిన ఒవైసీ

**-ఆయన ఫిట్నెస్ చూసి ఆశ్చర్యపోయిన స్థానికులు**

**-జిమ్‌లో అసదుద్దీన్ కసరత్తులు**

**-శారీరక దృఢత్వంపై దృష్టి పెట్టాలంటూ యువతకు పిలుపు**

**హైదరాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**
ఎల్లప్పుడూ రాజకీయ ప్రసంగాలతో, వాడివేడి వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీలో ఒక కొత్త కోణం ఆవిష్కృతమైంది. రాజకీయ వేదికలపై కాకుండా ఈసారి ఆయన వ్యాయామశాలలో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. తన ఫిట్‌నెస్‌ను ప్రదర్శిస్తూ యువతకు శారీరక దృఢత్వంపై కీలక సందేశాన్నిచ్చారు.నగరంలోని బహదూర్‌పురాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక ఫిట్నెస్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమానికి అసదుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా ప్రారంభించడమే కాకుండా, ఆయన స్వయంగా వ్యాయామశాలలో కసరత్తులు చేశారు. అక్కడ ఉన్న 20 కిలోల బరువుల ప్లేట్లను, డంబెల్స్‌ను పైకి ఎత్తారు. దీంతో అక్కడున్న వారు ఆయన ఫిట్నెసన్ను చూసి ఆశ్చర్యపోయారు.ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, యువత చదువుతో పాటు శారీరక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతిరోజు కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చని తెలిపారు.ఫిట్నెస్ ఒక జీవనశైలిగా మార్చుకోవాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ



కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులను అభినందిస్తున్న కొలను శ్రీనివాస్ రెడ్డి

**నిజాంపేట్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

నిజాంపేట రాజీవ్ గృహకల్ప మదర్‌థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఆ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా పోచారం ప్రభాకర్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీగా మన్నెపల్లి నర్సింహారావు, అధ్యక్షుడిగా సలాది శివ, ఉపాధ్యక్షుడిగా ఎం. మూర్తి, జనరల్ సెక్రటరీలుగా వై. దాలినాయుడు, పితాని శ్రీనివాసరావు, కోశాధికారులుగా ఏ.శ్రీనివాస్ రావు (అద్దంకి), పి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా ఏ. నాగభూషణం, పాల శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పి.బుజ్జిలు నియమితులయ్యారు. ఏడాది కాలం పాటు కొనసాగే ఈ కమిటీ పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు అండగా నిలబడేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి వారికి సూచించారు. మథర్‌థెరిస్సా అంటే మానవత్వానికి ప్రతీక అని, సమాజంలో మానవత్వం పరిమళించేవిధంగా కమిటీ స్ఫూర్తిదాయక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతియేటా ఆ మాతృమూర్తి జయంతి రోజైన ఆగస్టు 26న మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆరోగ్య ప్రయోజనం చేకూరుస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలి పారు. అలాగే ఈ ఏడాది కూడా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాల ని, అందుకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. కాగా కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులకు కొలను శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

## మాజీ మేయర్ కొరివి కృష్ణ స్వామి జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌లు, జంపన ప్రతాప్‌లు

**కంటోన్మెంట్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ గొప్ప సంస్కర్త, కుల సంఘాల ఆద్యుడుతొలి హైదరాబాద్ మేయర్ గా హైదరాబాద్ నగరానికి ఎన్నో సేవలను అందించిన మహనీయుడు కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎమ్మెల్సీ బండ ప్రకాష్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌లు అన్నారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ సమీపంలో కొరివి కృష్ణస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన 132వ జయంతి వేడుకలను కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు కాసాని వీరేష్ ముదిరాజ్, చొప్పరి శంకర్ ముదిరాజ్, అందే బాబాయ ముదిరాజ్, ఆగం పాండు ముదిరాజ్ , కార్పొరేటర్ సామల హేమ , మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముదిరాజ్, బిజెపి నేతలు వంశ తిలక్, బానుక మల్లికార్జున్,ఇతర జిల్లాల నేతలు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కృష్ణ స్వామి సేవాసమితి సభ్యులు జింకల వేణుగోపాల్ ముదిరాజ్, శ్రీలత ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, ప్రేమ్ కుమార్ ముదిరాజ్, పిట్ల సురేష్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, నీరుడి అశోక్ కుమార్ ముదిరాజ్, డాన్ రమేష్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, సైదులు ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్ ,శ్రీను ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు ఘన సత్కారం



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న గంజి రఘునాథ్

**మెహిదీపట్నం, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

ప్రతిభావంతులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్వాన్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గంజి రఘునాథ్ అన్నారు. కార్వాన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం కార్వాన్ మార్కండేయ భవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంజి రఘునాథ్ పాల్గొని పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు మెమొంటోలను అందజేసి ఘనంగా సత్కరించిన అనంతరం మాట్లాడారు... ప్రతి ఏడు మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రక్షాబంధన్ ను పురస్కరించుకొని కార్వాన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. గత సంవత్సరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ నగదు బహుమతిగా రూ. 2500, ద్వితీయ బహుమతిగా రూ. 2000, తృతీయ బహుమతిగా రూ. 1500 ల నగదు తో పాటు మెమొంటోలతో పాటు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. వీరితో పాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలను అందజేశామని తెలిపారు. టాలెంట్ ఎవరి సొత్తు కాదన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ ఉన్నత రంగాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. భావితరాలు బాగుండాలంటే ప్రతి ఒక్కరికి విద్య ఎంతో అవసరమన్నారు కార్యక్రమంలో కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఉత్తరపల్లి కృష్ణ, జనరల్ సెక్రెటరీ తీరం దాస్ గోపాల్, కోశాధికారి పల్లె పాండు పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలి : ఏసిపి సైదయ్య




బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ సైదయ్య,ఇన్స్‌పెక్టర్ పరుశురాం.

**బేగంపేట ఆగస్టు 16,ప్రభాతవార్త**

విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని మహంకాళి ఏసీపీ ఎస్.సైదయ్య అన్నారు.దేశవ్యాప్తంగా జరుగుతున్న మాదక ద్రవ్యాల అవగాహన ప్రచారాన్ని దృష్టిలో ఉంచుకొని శనివారం సికింద్రాబాద్ పాన్ బజార్ లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని మహంకాళీ డివిజన్ ఏసీపీ సైదయ్య,ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం,ఎస్సైలతో కల్సి నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ ఎస్.సైదయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పుడు మార్గాన్ని ఎంచుకోకుండా ఆరోగ్యకరమైన మరియూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని వారిని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేసారు.

# వర్గీకరణ చట్టం ద్వారా మాలలకు అన్యాయం : మాల జెఎసి

**గోషామహల్, ఆగస్టు16ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వర్గీకరణ చట్టం ద్వారా దళితుల్లోని 26 మాల అనుబంధ కులాలకు రోస్టర్ విధానం వల్ల పూర్తి అన్యాయం జరుగుతుందని తెలంగాణ మాలజె.ఎ.సి ఆధ్వర్యంలో తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్ మల్లు రవికి వినతి పత్రం అందచేశారు.తెలంగాణమాల సంఘాల జె.ఎ.సి చైర్మన్ డాక్టర్ మందాల బాస్కర్,గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జె.ఎ.సిచైర్మన్ బేరా బాలకిషన్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ గ్రూపు3లో చేరిన 26 కులాల విద్యార్థులకు,నిరుద్యోగులకు,ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతున్నాయని,ఉద్యోగాలలో ప్రమోషన్ రాకుండాఅన్యాయం జరుగుతుందన్నారు.26కులాలకు,విద్యా,ఉద్యోగ రంగంలో జరుగుతున్న వంటి నష్టం మీదసుదీర్ఘంగా చర్చించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవగాహన రాహిత్యంలో మేధావులతో,న్యాయ నిపుణులతో చర్చించకుండా,జనాభా లెక్కలు చేయకుండా ఇప్పటి వరకు 59 కులాలలో ఎవరికి,ఎవరు అభివృద్ధి చెందారు.లెక్కలు తీయకుండా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం,తన వ్యక్తి గత ప్రతిష్ట పెంచుకున్నారే తప్ప,ఐదుశాతం రిజర్వేషన్లు రోస్టర్ విధానం అమలు చేయడం పట్ల మాల అన్యాయం జరుగుతుందని ఆవేధన వ్యక్తం చేశారు.దీనిపై మాల మంత్రులు, ఎంపిలు ,గ్రూపు1, 15కులాలకు,గ్రూపు2లోఉన్న 17కులాలకి,గ్రూపు3లో ఉన్న 26 కులాలకి రిజర్వేషన్లు దూరం చేసే కుట్రగా కనబడుతుందన్నారు.వెంటనే 58 కులాలకు జరుగుతున్న నష్టం మీద,రిజర్వేషన్ వర్గీకరణ చేసిన తీరుపైన పునర్ సమీక్షచేసి రెండు శాతం రిజర్వేషన్లు,20 రోస్టర్ పాయింట్స్ కేటాయించాలని,లేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడుతామన్నారు.ఈ వినతిప్రతం సమర్పించిన వారిలో జె.ఎ.సి గౌరవ అధ్యక్షులు చెరుకు రామచందర్,గ్రేటర్ వైస్ చైర్మన్ డాక్టర్ వీరస్వామి,తాలూకు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్ మల్లురవికి వినతిపత్రం అందచేసిన మాల జె.ఎ.సి

## ఇస్కాన్ టెంపుల్‌లో ఎమ్మెల్యే తలసాని ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

మానవాళికి భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణుడు ధర్మ మార్గాన్ని బోధించారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం సికింద్రాబాద్ లోని సంగీత్ థియేటర్ సమీపంలో గల ఇస్కాన్ టెంపుల్ ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మం, ప్రేమ, కరుణ బోధనలు నేటికీ మనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. పూజల అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట రాంగోపాల్ పేట, బన్సీలాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు మహేష్ యాదవ్, వెంకట్, ఆలయ కమిటీ సభ్యులు సహదేవ్ దాస్, రాధిక పతి, హరికృష్ణ, భక్త సురేష్ తదితరులు ఉన్నారు.

## మధురానగర్‌లో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను అన్ని విధాల ప్రోత్సహిస్తూ ఆదుకునేందుకు తగిన విధంగా ఆర్థిక సహాయం అందజేయటం జరుగుతుందని మధురానగర్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ఎన్‌వీ మనోహర్‌రావు అన్నారు. అనంతరం సాగిరామ కృష్ణమ రాజు కమ్యూనిటీ హాల్‌లో అల్లూరి సీతారామరాజు, ప్రొఫెసర్ జయశంకర్, అక్షర జ్యోతి పేరుతో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు దాతల సహాయ సహకారాలతో ఆర్థికసహాయం అందజేశారు. దాదాపు 159 మంది విద్యార్థులకు రూ.8.81 లక్షలను అందజేయటం జరిగింది. అందులో ఒక లక్ష 36 వేల 300 దాతలు ఇవ్వగా మధురానగర్ సంక్షేమ సంఘం నుంచి రూ.7 లక్షల 44 వేల 700 అందజేశారు. 2010 నుంచి పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయటం జరుగుతుందని సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎమ్ ప్రతాప్‌రెడ్డితో పాటు కమిటీ సభ్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం



కృష్ణానగర్ ఆత్మీయ సమ్మేళనం సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాగంటి వజ్రనాథ్.

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

మున్నూరు కాపులంతా ఐక్యతతో పోరాడి హక్కుల సాధన కోసం కృషి చేయాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మాగంటి వజ్రనాథ్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో మున్నూరు కాపు సంఘం కార్యలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందులో ముఖ్యఅతిథిగా మాగంటి వజ్రనాథ్ పాల్గొనగా, సంఘం సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బడుగు రవీందర్, చైర్మన్ మామిడాల రాజు, మాజీ చైర్మన్ కోలా శివకుమార్, పెరిక రవి, బస్వరాజు, సతీష్, రాములు, ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వరదనీరు సమస్యను పరిష్కరించిన ఎన్ఎంసి అధ్యక్షులు



సమస్యను పరిశీలిస్తున్న కొలన్ రాజశేఖర్ రెడ్డి

**నిజాంపేట్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

నిన్న కురిసిన భారీ వర్షం కారణంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో అపార్ట్మెంట్లలో వరద నీరు చేరుకున్న సందర్భంగా అపార్ట్మెంట్ వాసులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే సమీక్షించి సదురు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం అపార్ట్మెంట్ వాసులు కొలన్ రాజశేఖర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రఫీయా బేగమ్, సురేందర్ యాదవ్, నారాయణ రెడ్డి, వీరబాబు, షేక్ బిక్కన్ షా, ప్రశాంత్, ఆది రెడ్డి, విజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాలగౌని బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టే విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

మూతపడ్డ కల్లుగీత దుకాణాలను తక్షణమే తెరిపించాలి బాలగౌని బాలరాజ్ గౌడ్ అన్నారు.భారత తొలి తెలుగు విప్లవ వీరుడు, బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి ఉత్సవాలను ఈ నెల 18న చిక్కడపల్లిలోని కల్లు కంపౌండ్ వద్ద ఘనంగా నిర్వహిస్తున్నట్లు గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలివెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్లు తెలిపారు. శనివారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది కల్లుగీత సొసైటీలు మూతపడ్డాయని తక్షణమే బేషరతుగా కల్లు దుకాణాలను తెరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. ట్యాంక్‌బండ్ పైన పాపన్న గౌడ్ విగ్రహాన్ని నెలకొల్పాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేసియోను చెల్లించాలని, 25 శాతం వైన్స్, బార్లు, కల్లుగీత సొసైటీలకు కేటాయించాలని కోరారు. కోకపేటలో గౌడ ఆత్మగౌరవ భవనను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్ గౌడ్, ఎస్. దుర్గయ్యగౌడ్, బైరు శేఖర్, బడే సాబ్, సింగం నాగేశ్వర్ గౌడ్, బాలగౌని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అనాధ ఆశ్రమానికి చేయూత

**నిజాంపేట్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మూడే రవి నాయక్ పుట్టినరోజు సందర్భంగా శనివారం శ్రీ ఆదర్శ చిల్డ్రన్ ఆశ్రమంలో తన పుట్టినరోజు వేడుకలు పిల్లల మధ్య జరుపుకుని ఒక పూట భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూ. 5000 ఆర్థిక సాయం అందించారు. ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి ఆపదలో ఉన్నవారికి సహాయం అందించడం గొప్ప అవకాశంగా భావించాలని తెలియజేశారు.

## డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేయాలి




నిరసన తెలుపుతున్న సిఐటియు

**నిజాంపేట్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

2023 రాజీవ్ గృహకల్పలో బస్తీ దవాఖాన నిర్మించారు, బస్తీ దవాఖాన ఉద్దేశమే బస్తిలో ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం ఇవ్వడం కోసం బస్తీ దవాఖాన పెట్టారు కానీ రాజీవ్ గృహకల్పలో ఉన్న బస్తీ దవాఖానలో ఇప్పటివరకు డాక్టర్, స్టాఫ్ నర్స్‌లను కూడా కేటగించకపోవడం సిగ్గుచేటు అని సిఐటియు నాయకులు అన్నారు. వర్షాకాలం ప్రారంభం అయినంక తర్వాత సీజన్ వ్యాధులు వస్తున్నాయని, చూపిచ్చుకుందాము అంటే బస్తీ దవాఖానలో డాక్టర్, స్టాఫ్ నర్స్ కూడా లేరు, టాబ్లెట్స్ అయినా ఉంటే ఇస్తారేమో అని బస్తీ దవాఖానకు వెళితే ఏ రోగానికి కూడా టాబ్లెట్స్ లేకపోవడం దుర్మార్గమని అన్నారు. బస్తి దవాఖానాలో అన్ని రకాల టాబ్లెట్స్ ఉండేటట్టు ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ ను నియమించాలని సిఐటియు, కాలనీలో నివసించే ప్రజలు విజ్ఞప్తిస్తున్నారు. ప్రజలు సీజన్ వ్యాధులతో వస్తే వైద్యం చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మనవి చేస్తున్నామని తెలిపారు. లేనిపక్షంలో పోస్టులను భర్తీ చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ సంతోష్ వి.బాలపీర్, ఎం.శంకర్, వీరన్న, బాలాజీ, శివ, నరేష్, సత్యనారాయణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి: ఏసిపి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతిఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య సూచించారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్ శివాజీ విగ్రహం వద్ద సైబర్ నేరాలు, మోసాలు, డ్రగ్స్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత ఫోన్‌కాల్స్, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్‌కు వెంటనే ఫిర్యాదు చేసి సత్వర రక్షణ పొందాలని అన్నారు. నేరల నియంత్రణ, శాంతిభద్రతలను కాపాడటంలో సీసీ కెమెరాల ఉపయోగం వివరించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి ఇన్స్పెక్టర్ కే.సైదులు, ఎస్ఐలు పి.భద్రయ్య, సి.వెంకటయ్య, వి.ప్రభాకర్ సిబంది పాల్గొన్నారు.

# మానవాళికి కృష్ణతత్త్వం మార్గదర్శకం : కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** పరమాత్మగా కీర్తించబడే శ్రీకృష్ణుడు మానవాళికి భగవద్గీతను ప్రసాదించిన ప్రేమ మూర్తి అని, ఆ కృష్ణతత్వం అందరికి మార్గదర్శకమని విశ్రాంత ఐఏఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ చారి అన్నారు. చిక్కడపల్లి లో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ త్రిమూర్తుల గౌరీశంకర్ కుటుంబీకులు నెలకొల్పిన శ్రీకృష్ణ మందిరంలో మూడు రోజుల పాటు జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు రమణాచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జ్యోతి ప్రకాశనం చేసి అర్చనలు చేసి గోపాలుడి కైంకర్యాలు సమర్పించారు.ప్రతి యేటా త్రిమూరుల గౌరీశంకర్ శ్రీకృష్ణాష్టమి వేడుకలను క్రమం తప్పకుండా ధార్మికరీతితో, సంగీత, నృత్య, ప్రసంగ కార్యక్రమాలతో కొనసాగించడం పట్ల వారిరువురిని అభినందించారు. అలాగే కృష్ణ మందిరం మరింత విశాలంగా, సౌకర్యంగా వుండేందుకు తగు సూచనల చేరి గౌరీ శంకర్ దంపతులను ఆశీర్వదించారు. ఉత్సవాలలో భాగంగా జయ వెంకటేష్ బృందం చే వేద పఠనం, సూర్యకుమారిచే విష్ణు లలిత సహస్రనామ పారాయణలు, గీతారెడ్డి సమీక్ష బృందం చే భక్తి గాన కార్యక్రమం, ప్రజ్ఞా కళా సమితి మల్లాది విజయలక్ష్మి బృందం ఆధ్వర్యంలో భక్తి, సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో అతిథిగా సుప్రసిద్ధ రచయిత్రి డాక్టర్ కేవీ కృష్ణకుమారి, భారతీ కమలాకర్, మానస ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ దంపతులు అతిధులను సత్కరించారు.



విశ్రాంత పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారిలను సత్కరిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ త్రిమూర్తుల గౌరీశంకర్ కుటుంబీకులు

# ఉత్సాహంగా ప్రైమ్ హైదరాబాద్ వాలీబాల్ లీగ్

### -పోటీల్లో 32బాలురు, 24బాలికల జట్లు

**హైదరాబాద్,ఆగస్టు 16,ప్రభాతవార్త:**

ప్రైమ్ హైదరాబాద్ బ్లాక్ హాక్స్ వర్సిటీ వాలీబాల్ లీగ్ క్వాలిఫయర్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శనివారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన క్వాలిఫయర్స్‌లో 32 బాలుర, 24 బాలికల జట్లు పాల్గొన్నాయి. ఇందులో గెలిచిన 12 బాలుర, 8 బాలికల జట్లు ప్రధాన పోటీలకు అర్హత సాధించాయి. ఈనెల 22 నుంచి వచ్చే నెల 24 వరకు స్కూల్ లీగ్ జరగనుంది. క్వాలిఫయర్స్ ముగింపు వేడుకల్లో ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లోని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు జాతీయ వాలీబాల్ జట్టులో తెలుగు క్రీడాకారులే ఎక్కువగా ఉండేవారని, ఇప్పుడా సంఖ్య చాలా తగ్గిందని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులను గుర్తించి, వారిని తీర్చిదిద్ది ప్రైమ్ వాలీబాల్ లీగ్‌తో పాటు జాతీయ స్థాయిలో సత్తా చాటాలే తయారు చేయాలనే లక్ష్యంతో ఈ స్కూల్ లీగ్‌ను ప్రారంభించామని అభిషేక్ చెప్పారు. యువ క్రీడాకారుల ఉత్సాహం చూస్తుంటే వచ్చే రెండు.. మూడేళ్లలో తెలంగాణ ప్లేయర్లు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహించేలా కనిపిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ జట్టులో తెలుగు వాళ్లు లేరనే తన బాధ మిమ్మల్ని చూస్తుంటే మాయమైందని, మీ ఆట చూశాక భవిష్యతలో తప్పకుండా మీరు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తరఫున స్టార్స్‌గా ఎదుగుతారనే నమ్మకం వచ్చిందని చెప్పారు. ఇక, గాడియం, శ్రీనిధి, డీపీఎస్ నాచారం, నాదర్‌గుల్, పల్లవి, ఆగాఖాన్, చిరెక్, ఫ్యూచర్ కిడ్స్, సిల్వర్ ఓక్స్, ఇండస్ పాఠశాల జట్లతో పాటు మొత్తం 20 టీమ్‌లు ప్రధాన పోటీలకు అర్హత సాధించాయి.



లీగ్‌కు హాజరైన జట్లతో కంకణాల అభిషేక్‌రెడ్డి తదితరులు

## చెరువును తలపిస్తున్న మాతాజీనగర్ రోడ్డు

### -కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వాహనదారులు,పాదచారుల ఇబ్బందులు

**బేగంపేట ఆగస్టు 16,ప్రభాతవార్త**



మాతాజీనగర్ వెళ్లే దారి నీటితో నిండిపోయిన దృశ్యం.

బేగంపేట డివిజన్ పరిధిలోని మాతాజీనగర్ వెళ్లే రోడ్డులో భారీ ఎత్తున నీరు నిల్చిపోవడంతో వాహనదారులు ,పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీ స్థాయిలో నీరు నిల్చిపోయింది.దీంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.బస్తీకి రోడ్డు వేసేందుకు రోడ్డు ఒక వైపు తవ్వి ఉంచడం ఇదే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొందని వారు ఆరోపిస్తున్నారు.రోడ్డులో కొంత భాగం వేయడంతో మరో వైపు నీరు పెద్ద ఎత్తున నిల్చిపోయింది.దీనికి తోడు మురుగు నీరు సైతం ఇక్కడ పెద్ద ఎత్తున చేరడంతో బస్తీ నుంచి బయటకు వెళ్లేవారు,బయట నుంచి బస్తీలోకి వచ్చే వారు మురుగునీటిలో దిగి రావాల్సిన దుస్థితి ఉందని స్థానిక బస్తీ వాసులు వాపోతున్నారు.అయితే ఈ విషయాన్ని స్థానికులు అధికారులు,కాంట్రాక్టర్ దృష్టికి తీసికెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున నీరు నిల్చి చెరువును తలపిస్తుంది.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మాతాజీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కాంగ్రెస్ నాయకుడు మునీర్ ఖాన్ అధికారులను కోరుతున్నారు.

IN THE COURT OF THE HONOURABLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGERANGA REDDY DISTRICT, AT: L. B. NAGAR
O. S. No. 637 of 2025

**Between:**
1. Smt. NANDIGAMA AMRUTHAMMA, W/o Late N. Bheem Reddy, Aged about 70 years, Occ: House Wife.
2. Sri. NANDIGAMA NARAYAN REDDY, S/o Late N. Bheem Reddy, Aged about 53 years, Occ: Business
3. Sri. NANDIGAMA GOPAL REDDY, S/o Late N. Bheem Reddy, Aged about 50 years, Occ: Business, Plaintiffs 1 to3 R/o H. No. 18-84/A, Kamala Nagar, Chaitanyapuri, Hyderabad – 500 060
4. Smt. BEMBADI SUNITHA @ NANDIGAMA SUNITHA, W/o Sri. B. Ravinder Reddy, D/o Late N. Bheem Reddy, Aged about 47 years, Occ: House Wife, R/o H. No. 9-6-251/1, Plot No. 6, Road No.7, Durga Bhavani Nagar, Saidabad, Hyderabad – 500059.
5. Sri. NANDIGAMA SRIKANTH REDDY, S/o Late N. Bheem Reddy, Aged about 38 years, Occ: Private Employee, H. No. 1-1-276, Flat No. 303, R.K. Apartments, Street No. 1, Chikkadapally, Hyderabad - 500020 ... Plaintiffs

And

1. The Tahsildar, Saroornagar Mandal & Another ....Defendants

To
All Concerned
Please take notice that the above-named Plaintiffs have filed a suit to declare them as Legal Heirs of Late Nandigama Bheem Reddy, S/o Late N. Narsi Reddy. The Honourable Court was pleased to order publication of this notice for your appearance in the above suit and the matter is posted to 15-09-2025, therefore, any person/s having objections may appear before the abovenamed court at 10.30 am on the said date either in person or through an Advocate, failing which the matter will be heard ex-parte and orders will be passed on merits. Hence this notice.

// BY THE ORDER OF THE COURT//
GOTURU KRISHNA RAO
N. VIDYA SAGAR
SMT. P. ANITHA
TS/1838/2005
Advocates
Plot No. 297, Road No.11, Vasavi Colony, SRK Puram HYDERABAD - 500 102
9948316457

## జిహెచ్ఎంసి కార్మికులు,ఆశావర్కర్లకు చీరల పంపిణీ



హెచ్ఎంసి కార్మికులకు ఆశ వర్కర్లకు చీరల పంపిణీ చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

పేదలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరు ముందుండాలని బిఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠాజైసింహ్ అన్నారు. శనివారం బిఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్మికులకు ఆశ వర్కర్లకు చీరల పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఠాజైసింహ్ పారిశుద్ధ కార్మికులకు చీరల పంపిణీ చేశారు అనురాధ సురేందర్ మరియు ప్రేమలత ఆధ్వర్యంలో జరిగింది ఇంకా ఈ కార్యక్రమానికి రవి యాదవ్ నేత శీను పవన్ ఏ శ్రీనివాస్ అస్లాం రాజు యూనిస్‌అబ్బు అహ్మద్ ఖలీల్ ప్రియాంక మంగ, గురుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో రాణిస్తున్నవారిని ప్రోత్సహించడం మంచి మార్గం

### - ప్రముఖ వైద్యులు డాక్టర్ శాసనకోట ఆవులప్ప

**చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఉన్నత ఆశయాలతో విద్యలో రాణిస్తున్న వారిని ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం ఉంటుందని ప్రముఖ వైద్యులు, ఐఈసీ గ్లెనీగల్స్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ శాసనకోట ఆవులప్ప అన్నారు. శనివారం నగరానికి చెందిన ఎ,మైనిక, డి.జాన్సన్‌లు ఎస్ఎస్‌సిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకుగాను డాక్టర్ ఎస్.అవులప్ప తన తల్లితండ్రులు శాసనకోట చిన్న సుబ్బయ్య, ఎస్ నంజమ్మ జ్ఞాపకార్థం స్థానిక సరస్వతి విద్యా మందిర్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బంగారు పతకాలతో పాటు నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు. గత పది సంవత్సరాల నుంచి ఎస్ఎస్‌సిలో టాపర్‌గా నిలిచిన వారికి బంగారు పతకాలను అందస్తున్నామని డాక్టర్ అవులప్ప అన్నారు. సరస్వతివిద్యామందిర్‌కు అవసరమైన ప్రొజెక్టర్‌కు అవసరమైన సీపీయును విరాళంగా అందించారు. విద్యలో మంచి ఫలితాలను సాధించే వారిని ప్రోత్సహిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని డాక్టర్ అవులప్ప అన్నారు. కార్యక్రమంలో శాసనకోట మాధవి తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME
I, DEVAVRAT Gaikwad Kanayalal S/o. Kanayalal Gaikwad & Madhunetra Gaikwad R/o. H.No. 30-1608/2/6 Krupa Deep Apartment-II Surya Nagar Neredmet. 500056 Changed My Name from Gaikwad Kanayalal Devavrat Gaikwad Kanayalal to name as Devavrat & Surname as Gaikwad Kanayalal.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II, AT: TRIVENI COMPLEX, 1st FLOOR, ABIDS, HYDERABAD
O. A. No. 586 of 2025

**Between:**
City Union Bank Ltd, Kukatpally Branch, Hyderabad Rep.by its Branch Manager ...Applicant

And

M/s.Ferrous Metallic Enterprises & others ...Defendant/s

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. M/s.Ferrous Metallic Enterprises Rep.by it's Prop. Mrs. Srilatha Plot.no 193, Survey No.241&316, 7-610/1/13, Subagh Nagar, Pipeline Road, Jeedimetla, Hyderabad.
2. Mrs. Srilatha, W/o Mr.R.Suresh Reddy, Age 42 Yrs, Female R/o.Villa No.55, Manjeera Smart Homes, Quthbullapur, Hyderabad
3. Mr.R.Suresh Reddy, S/o.Mr. R.Thippanna, Age 48 Yrs, Male R/o. Villa No.55, Manjeera Smart Homes, Quthbullapur, Hyderabad.
4. Mr. R.Thippanna, S/o.Sri Narappa, Age 78 Yrs, Male R/o.Villa No.55, Manjeera Smart Homes, Quthbullapur, Hyderabad. ...Defendant/s

Please take the summons in the above O.A.No.586/2025 filed by the applicant for recovery of money of Rs.1,11,38,799/- against you. The Hon'ble Tribunal ordered Summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 16/09/2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under.
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are directed to appear before this Tribunal at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001 in person or through an Advocate and file Written Statement on 16/09/2025 at 10.30 a.m. and show cause as to why reliefs prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 11th of August, 2025.

(By order of the DRT -II, Hyderabad)
Sd/- Signature of the Officer
Authorized to Issue Summons

## తొర్రూరులో ఘనంగా రేణుక ఎల్లమ్మ ధ్వజస్తంభ ప్రతిష్టాపన



**హయత్ నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ గ్రామం లో రేణుక ఎల్లమ్మ తల్లి ధ్వజస్తంభ పున ప్రతి ష్టాపన, నాభిషిల ప్రతిష్ట కార్యక్ర మం అత్యంత వైభవంగ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి వేలాది మంది భక్తు లు తరలివచ్చి అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నా రు.. ఆలయ కమిటీ చైర్మన్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాలలో భాగం గా ఈనెల 18న బొడ్రా యి పునప్రతిస్తాపన, ఎల్లమ్మ తల్లి ఊరేగింపు ఉంటుందని 19న రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పణ కార్యక్రమాలు కొనసాగు తాయని రాంరెడ్డి తెలిపా రు. ఈ క్రమంలో గ్రామంలో వారం రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యా యని ఉత్సవ కమిటీ తెలిపింది. ఆలయా న్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.





## రాఘవేంద్ర కాలనీలో ఓపెన్ జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్.

**హయత్ నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** కాలనీలోని కొద్ది పాటి స్థలంలోనే ప్రణాళిక బద్ధంగా పోచమ్మ దేవాలయం, సంక్షేమ సంఘ భవనము, పార్క్, ఓపెన్ జిమ్ ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎల్ బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ లోని రాఘవేంద్ర కాలనీలో దాదాపు 10 లక్షల రూపాయల వ్యయంతో నూత నంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను శనివారం వారు ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాలనీ వాసు లందరూ ఓపెన్ జిమ్ ను ఉపయోగించుకోవాలని సూచించారు.

## సైనికులు దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివి

: కాసుల చంద్రశేఖర శర్మ



భారత సైనికులను సన్మానిస్తున్న డాక్టర్ వెంకట్ రెడ్డి, కాసుల చంద్రశేఖర్ శర్మ, నారాయణరెడ్డి తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** భారత సైనికులు దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని దయా నంద్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు జనార్దన్ రెడ్డి, కాసుల చంద్రశేఖర్ శర్మ, నారా యణరెడ్డి లు పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మలక్ పేట దయానందనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో భారతదేశ సైనికులకు పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాల తో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్న భారతదేశ సైనికులను స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. అదేవిధంగా స్వదేశీ వస్తువులనే వాడాలని అందరూ నినాదించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వెంకటేష్ గుప్తా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న బోనగిరి చంద్రశేఖర రావు, డాక్టర్ రోహిన్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ లోని స్వామి వివేకానంద పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1995, 1997 10వ తరగతి అల్యూమిని బ్యాచ్ పూర్వ విద్యార్థులు విచ్చేసి ఆప్యాయతలతో ఒకరినొకరు పలకరిం చుకుని గత పాత స్మృతులను పంచుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరత్నమ్మ, శాంత, ప్రసాద రావు, చక్రపాణి, లక్ష్మణరావు, సంతోష్ కుమార్, పూర్వ విద్యా ర్థులు భోనగిరి చంద్రశేఖర్, డాక్టర్ రోహిన్ కుమార్, రాఘవేంద్ర, రమేష్ గౌడ్, స్వాతి, బసంతి, మధుకర్, కిరణ్ ,శంకర్, మధుసూదన్ రెడ్డి, కుమార్, రామలింగేశ్వర రావు, అశ్విని కుమార్, సురేష్, రాజవర్ధన్ రెడ్డి, వెంకట్ రాయుడు, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీనగర్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



కాలనీ నూతన కమిటీ సభ్యులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ బాలా జీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షునిగా బోల్గం రాజేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షులు గా గోపాల్‌కిషన్‌రావు, బి.వెంకటయ్య, ప్రధానకార్యదర్శిగా కుమా రస్వామి, కోశాధికారిగా జి.పాండుగౌడ్, కార్యనిర్వాహక కార్య దర్శిగా డి.వినోద్, సంయుక్తకార్యదర్శులుగా అరవింద్, ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా జీవన్‌గౌడ్, వనజా, యాదయ్య, బోల్గం సాయినాథ్‌గౌడ్, అవినాష్, ఠాగూర్‌వరుణ్‌సింగ్, ఉషారాణిలు ఎన్నికయ్యారు. రాజేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో కుమారస్వామి వార్షిక నివేదికను అందించగా కోశాధికారి పాండుగౌడ్ వార్షిక ఆర్థిక నివేదికను సమర్పించారు.

## మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఓల్డ్ మలక్ పేట్ శ్రీ మల్లికార్జున దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. పూజారి కృష్ణ మూర్తి, నిర్వాహకులు డాక్టర్ యాదగిరి, ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృ ష్ణ జన్మాష్టమి వేడుకల్లో పోచమ్మ దేవాలయం ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీపురు రాజారావు గౌడ్, రామకృష్ణ, ఆలయ నిర్వాహకులు జ్ఞానేశ్వర్, విజయ్ కుమార్, కే. రాజు, రాజేష్ పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ

**మలక్ పేట ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతా మని కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. ముసారాంబాగ్ డివిజన్ శాలివాహననగర్ లోని శాలివా హన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సతీష్ తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఎలిమినే టి జంగారెడ్డి, బిజెపి అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్ రెడ్డి, కటకం సుభాష్, ఆనంద్, శ్రవణ్ గౌడ్ పాల్గొనగా వారికి వైద్యు లు పరీక్షలు నిర్వహించారు. పూర్తి బాడి చెకప్, బిపి, వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ కౌశిల్ రెడ్డి, డాక్టర్ సుకేష్, డైరెక్టర్ ఇందిరా, భూలోకరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, చిత్రంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ, సామ రంగారెడ్డి, డాక్టర్ సతీష్ తదితరులు

## కృంగిన డ్రైనేజీ లైన్, ధ్వసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

**హయత్ నగర్, ఆగస్టు16 ప్రభాతవార్త :** హయత్ నగర్లోని వీరభద్ర నగర్ కాలనీ ప్రధాన రోడ్డులో ధ్వసమైన డ్రైనేజీ పైప్ లైన్, ధ్వసమైన రోడ్లకు వెంటనే మారమ్మతులు చేయాల ని కోరుతూ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి శనివారం జలమండలి ఉన్నతధికారి వివిల్ ప్రవీణ్ కుమార్ ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.... వీరభద్ర నగర్ కాలనీలో ప్రధాన మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రంక్ లైన్ కృంగి పోయిందని తెలిపారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని దాదాపు 20 నుండి 30 కాలనీల డ్రైనేజీ నీటితో పాటు వర్షపు నీరు కూడా చేరుతుం డడంతో పైపులు ఒకేసారి కుంగిపోవడం జరిగిందన్నారు. మరమ్మతు లు చేసేందుకు ఆర్ అండ్ బీ విభాగం సరఫరా చేస్తున్న పైపులు నాసిరకంగా ఉండటంతో సమస్య శాశ్వతంగా పరిష్కారం కావడం లేదన్నారు. భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా పనులు చేపట్టెందుకు 5 లక్షల రూపాయల వ్యయంతో కూడిన ఎస్టిమేషన్‌ను జలమండలి అధికారికి ఆయన అందించారు. పాడైన భూగర్భ డ్రైనేజీ మరియు దెబ్బతిన్న రోడ్ల ఫోటో ప్రింట్లను చూపించి వాటి మరమ్మ త్తుల కోసం తక్షణం నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకు న్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు నాగేంద్ర, మహేంద ర్ నాయక్, బీజేపీ నాయకులు పారంద సాయి పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో వైభవోపేతంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**మేడిపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త;** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ భవాని నగర్‌లో ఆర్.కె యువభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. నగరంలోని ఆర్.కె యువ భారతి ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్ మార్గ నిర్దేశనంలో శనివారం నిర్వహిం చిన ఈ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. తొలుత శ్రీ కృష్ణ అలంకరణతో ప్రారంభమైన వేడుకలో గోమాత హారతి, చిన్ని కృష్ణ గోపికల వేష ధారణ, చిత్ర లేఖనం పోటీల నిర్వహణ, భగవద్గీత విశిష్టత పై ప్రసంగాలు. ఉట్టి కొట్టే మహత్తర కార్యక్రమంతో పాటు శ్రీ కృష్ణ జన్మ ఆవశ్యకతపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథులు మాతా అన్నపూర్ణేశ్వరి , మాతా స్వామి దుర్గానంద స్వామి. బీజేపీ రాష్ట్ర నాయకులు ఏనుగు సుదర్శ న్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ... ధర్మం గతి తప్పినప్పుడు, అవని, పధర్మం పెచ్చు మీరినప్పుడు భగవానుడు జన్మిస్తాడని. అదే క్రమంలో శ్రీ మహా విష్ణువు ఎనిమిదవ అవతారంగా ద్వాపర యుగంలో శ్రీ కృష్ణ భగవానుడు జన్మ తీసుకుని ధర్మ పరిరక్షణ చేసాడని తెలిపారు. ఆ దేవదేవుడి పసి తనంలోనే లోక కంఠకుడైన కంసుడిని వదించి సర్వ జనుల హితం కలిగించాడని అన్నారు. మహాభారత యుద్ధంలో కౌరవుల పక్షం వహించిన భగవా నుడు మహోన్న మహోన్నతమైన భగవద్గీత అందించి జగద్గురువుగా ప్రసిద్ధికెక్కారని వివరించారు. గీతలో ఆయన అందించిన సారం అర్థం చేసుకుంటే మానవ సమాజంలో ఎవరికి వారు పాటించాల్సిన విధివి దానాలు,నడవడిక అర్థమవుతాయన్నారు. ఆ భగవానుడు భోదించిన గీతా సారాంశం నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. భగవద్గీత అధ్యాయాలు ఆకలింపు చేసుకుంటే నేటి తరంలో ఎటువం టి పెడధోరణులు. రుగ్మతలు తలెత్తవని, శారీరకంగా, మానసికంగా వ్యక్తి ఉన్నతిని పొందుతాడని అన్నారు. శ్రీ కృష్ణ పరమాత్మ లీలలను నెమరు వేసుకోవడానికి జన్మాష్టమి వేడుకలు జరుపుకుంటారని వారి ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండారు పవన్ రెడ్డి. మనోహర్ రెడ్డి, జైపాల్ రెడ్డి ,నీలారపు ఐలయ్య యాదవ్, స్వరూప చంద్రా. సుధాకరాచారి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తది తరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మాత అన్నపూర్ణేశ్వరి, స్వామి దుర్గానంద స్వామి , ఏనుగు సుదర్శన్ రెడ్డి, రాము యాదవ్, తదితరులు

## మీర్‌పేట్ ద్వారకామాయి పీఠంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతి హిల్స్ రోడ్ నెంబర్ 5లోనున్న బాబా నివాస ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ ద్వారకామాయి పీఠంలో శనివా రం శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు ఘనం గా జరిగాయి. పీఠాధిపతి అయిన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త పూజ్యశ్రీ గోపాలకృష్ణా నంద స్వామీజీ మంగళ శాసనములతో కృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా బాబా మందిరం లో శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తికి అదే విధంగా నెమలి పింఛధారణలో ఉన్న సాయి బాబాకు పురుషసూక్తంతో అభిషేకం, 1008 తులసి దళాలతో శ్రీకృష్ణ సహస్ర నామావళితో పూ జాదికాలు, భగవద్గీత పారాయణానికి సంబం ధించి శ్లోకాల పఠనం, బాబాకు మధ్యాహ్న మహా హారతి తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామీ జీ స్వహస్తాలతో భక్తులకు భగవద్గీత ఉచిత గ్రంథ వితరణ చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణానంద స్వామీజీ భక్తులకు విశ్వ గురువు శ్రీకృష్ణునిపై అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్, జాతీ య బిసి మాజీ చైర్మన్ ఈశ్వరయ్య గౌడ్, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ మాజీ ము ఖ్య కార్యదర్శి జానకి ఆర్ కొండపి, ఆదిలాబాద్ జిల్లా కోర్టు జడ్జి ఎంవి రమేష్, సీనియర్ ఆడిటర్ రంగనాథ్, బాబా భక్తులు అనితారె డ్డి, జమునారెడ్డి, మహీలతారెడ్డి, ఎస్‌పి శా స్త్రి, విమలా శాస్త్రి, పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, సాయిలలిత్ పాల్గొన్నారు.



సాయిబాబా పీఠంలో శ్రీకృష్ణ పూజలు నిర్వహించిన పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

## జిల్లెలగూడ శ్రీవారి ఆలయంలో కనుల పండువగా శ్రీకృష్ణాష్టమి

**సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని పురాతనమైన దేవాల యాల్లో ఉత్తర ద్వారం గల అరుదైన దేవాల యంగా గుర్తింపు పొందిన మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పే ట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ పాత గ్రామంలోనున్న శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధా న పూజారి డింగరి రామాచార్యులు, రాఘవా చారిలు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

### అందెల ప్రత్యేక పూజలు

కాగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు యాద వ్ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, మాజీ కార్పొరే టర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, భీమ్‌రాజ్, నాయకు లు చీలంపల్లి రాజశేఖర్, గాజుల మధు, బొజ్జ పరమేష్‌లతో పాటు పలువురు పాల్గొ న్నారు. అదే విధంగా నాదర్‌గుల్‌లోని శ్రీరా ధాకృష్ణ దేవాలయాన్ని కూడా అందెల శ్రీరా ములు యాదవ్ సందర్శించి పూజలు చేశారు.



శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పూజలకు హాజరైన అందెల శ్రీరాములు యాదవ్

## భారత రాజకీయాల్లో వాజ్‌పేయిది చెరగని ముద్ర: శంకర్‌రెడ్డి



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని, ఉత్తమ పార్లమెంటేరియన్ భారతరత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయిది భారతదేశ రాజకీయాల్లో చెరగని ముద్ర అని తెలంగాణ రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర బిజెపి కార్యాలయంలో జరిగిన వాజ్‌పేయి 7వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భం గా పార్టీ నేతలతో కలిసి వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మచ్చలేని అరుదైన నేత వాజ్‌పేయి అని అన్నారు. ప్రతి ఒక్కరికీ వాజ్‌పేయి ఆదర్శ ప్రాయులని తెలిపారు.

## బడంగ్‌పేట్ లార్డ్స్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని శివనారాయణపురంలోనున్న లార్డ్స్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్ట మి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రా మిడి సంతోష్, ఇంఛార్జి రేఖా సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థు లు పాల్గొన్నారు.




శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో ఉన్న బాలబాలికలు

## కొత్తపేట డివిజన్ బిజెపి కమిటీ ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న సామా రంగారెడ్డి, పవన్‌కుమార్, జంగారెడ

**ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** పార్టీని పటిష్టం చేయడంతో పాటు డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డిలు పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షులు మంచి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ పార్టీ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. నూతన కమిటీకి ముఖ్య అతిధులు నియామక పత్రాలను అందజేశారు. ప్రధానకార్యదర్శిగా గట్టు మహేష్‌కుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మెరుగు వైజయంతి, ప్రధానకార్యదర్శిగా పుష్పమ్మ, దళితమోర్చా అధ్యక్షులుగా నర్సింగరావు, పార్టీ ఉపాధ్యక్షు లుగా రాకేష్‌యాదవ్, ర్యాక శ్రీనివాస్, భీమ్‌రాజ్, సరికొండ లావణ్య, యాదయ్య, పింకీసింగ్, సాయి, యాపట్ల జంగయ్య, కార్యదర్శులుగా జస్పాల్‌సింగ్, నవీన్, మధు, వలిగొండ స్వామి, స్వర్ణ, మోహన్‌రావు, కోటగిరి శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్చార్జిగా సంగ్రామ్, కార్యవర్గసభ్యులుగా రేవల్లి రామకృష్ణ, సంజయ్, మారుతి నియామకమయ్యారు.

## వాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం ప్రారంభం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలో నూత నంగా ఏర్పాటు చేసిన జైవాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం కార్యాలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవై శ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నూత న కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న నాగోల్ జైవాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైవాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జగిని అశోక్,ప్రధానకార్యదర్శి అనిల్,కోశాధికారి సాయి రమేష్, కొంపల్లి శ్రీనివాస్, కోర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

## ఉప్పల్‌లో కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు

**ఉప్పల్ ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఉప్పల్ లోని ఓల్డ్ విలేజ్(భరత్ నగర్)లో ఇటీవలనే కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులను చేయిస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్ తో కలిసి శనివారం ఓల్డ్ భరత్ నగర్ లోని అమృత్ రెడ్డి సంఘము ఏరియాలో 58 లక్షల తో సీసీ రోడ్డు ,92 లక్షలతో డ్రైనేజీ జరుగుతున్న పనులను పరిశీలించి సకాలం లో పూర్తి చేయాలని ఆదేశించారు., త్వరలో నే ఉప్పల్ డివిజన్‌లోని మిగత ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న ఓపెన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, ఈగా ఆంజనేయులు ముదిరాజ్, భూసం రఘునాథరెడ్డి, నల్ల ప్రభాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, బుర్ర ఈశ్వర్ గౌడ్,వేముల పరమేష్, నల్ల రాజిరెడ్డి, స్వర్ణాకర్, అన్నపురెడ్డి చంద్రారెడ్డి, శివ యాదవ్, బల్ల పరమేష్, ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బజార్ నవీన్ గౌడ్, రంగుల శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

